# ఓటమి భయంతోనే కాంగ్రెస్ దాడులు



దేవదారికుంట తండాలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ప్రభుత్వ విప్ గువ్వల, రైతులు

▪ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

అమ్రాబాద్, అక్టోబర్ 27 : నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో తాము ఓడిపోవడం ఖాయమని భావించి కాంగ్రెస్ నేతలు స్థానిక మాజీ ఎమ్మెల్యే భౌతిక దాడులకు పాల్పడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలను, సర్పంచులను లొంగదీసే ఆఖరి ప్రయత్నంగా ముందుకు సాగుతున్నారని ఆది సరైన పద్ధతి కాదని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఖండించారు. శుక్రవారం మండలంలోని మన్ననూర్, మాచారం తదితర గ్రామాల్లో పర్యటించిన ఆయన తమ కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ ప్రలోభాలకు లోబరుస్తూ అనవసరమైన వ్యాఖ్యలు చేస్తూ ఓటమి భయంతోనే తాము జీవితంలో ఇక గెలవలేమని ఎప్పటికీ శాశ్వత మాజీ ఎమ్మెల్యే గానే ఉండాల్సి వస్తుందని తన అనుచరులతో దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. గురువారం అచ్చంపేట పట్టణంలో జరిగిన భారీ బహిరంగ సభకు బీఆర్ఎస్ శ్రేణులు అభిమానులు భారీసంఖ్యలో అక్షలాదిగా తరలి రావడాన్ని చూసి ఓర్వలేక ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆయన అన్నారు. వచ్చే ఎన్నికల్లో అచ్చంపేట గడ్డపై గులాబీజెండా ఎగరేయడమే లక్ష్యంగా తమ కార్యకర్తలు ఈ నెలా రోజులు సైనికుల్లా పనేచేసి రాష్ట్రంలోనూ, ఇటు నియోజకవర్గంలోనూ గులాబీ జెండాను ఎగురవేస్తామని ఆశాభావ వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు ప్రతిఇంటికీ చేరాయని వాటిని అనుభవిస్తున్న ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్‌కు ఓటు వేస్తారనే నమ్మకం తమకుందని, ఎక్కడ దాడులు చేసిన కార్యకర్తలు అసహనానికి లోనుకావొద్దని ధైర్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సర్పంచులు శ్రీరాంనాయక్, వెన్నెల నేతలు చెన్నకేశవులు, శ్రీనివాసులు రామచంద్రు, పెద్దిరాజు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మ దహనం**

ఉప్పునుంతల, సెప్టెంబర్ 27 : తెలంగాణ ప్రభుత్వం రైతులకు అందచేస్తున్న రైతుబంధు పథకాన్ని నిలిపివేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈసీకి ఫిర్యాదు చేసిన సందర్భంగా శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు మండల పరిధిలోని దేవదారికుంట తండాలో ప్రభుత్వవిప్ గువ్వల బాలరాజు,నాయకులు కాంగ్రెస్ పార్టీ దిష్టి బొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ గువ్వల బాలరాజు మాట్లాడుతూ ఓటమి భయంతో కాంగ్రెస్ పార్టీ కుళ్లు కుతంత్రాలకు పాల్పడుతుందన్నారు.రైతుల నోటిలో మట్టి కొట్టాలని రైతు బందు పథకాన్ని నిలిపివేయాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. రైతులు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ పర్వతాలు, వసురాంనాయక్, బాలు తదితరులు పాల్గొన్నారు.

# చెక్‌పోస్ట్‌లో తనిఖీలు చేసిన స్పెషల్‌ఫోర్స్



మంగనూర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న స్పెషల్ ఫోర్స్ పోలీసులు

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 27 : నాగర్‌కర్నూల్ జిల్లాలో వెల్దండ మండలం కొట్రా చెక్‌పోస్ట్‌ను కల్వకుర్తి డీఎస్పీ, బిజినేపల్లి మండలం మంగనూరు చెక్‌పోస్ట్ వద్ద సెంట్రల్ బలగాలతో శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. నాగర్‌కర్నూల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బిజినేపల్లి చెక్‌పోస్ట్‌ల వద్ద తనిఖీలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 2023 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఏర్పాటు చేసిన ఆరు చెక్‌పోస్టులను, ఒక ఇంటర్ స్టేట్ చెక్ పోస్టు, ఐద ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్ పోస్టుల వద్ద ప్రతి వాహనాలను 24 గంటలపాటు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులోల భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో వెల్దండ మండలం కొట్ర చెక్ పోస్ట్‌నీ కల్వకుర్తి డీఎస్పీ తనిఖీ చేసి బ్రీఫింగ్ చేశారు.

# ర్యాండమైజేషన్‌తో సిబ్బందికి విధుల కేటాయింపు

◆ జిల్లా ఎన్నికల అధికారి ఉదయ్‌కుమార్



విధులను కేటాయిస్తున్న ఎన్నికల దృశ్యం

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 27 : జిల్లాలో 4 నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు, 4,546 మంది ప్రభుత్వ ఉద్యోగస్తులను ఎన్నికల పోలింగ్ సిబ్బందిని ఒకటో ర్యాండమైజేషన్ ద్వారా నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాల వారీగా 817 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బందిని కేటాయించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఐడీవోసీ కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కార్యాయలంలో కలెక్టర్ ఉదయ్‌కుమార్ కేటాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సంఘం రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా 4,546 మంది పోలింగ్ సిబ్బందిని ఎంపిక చేశామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ర్యాండమైజేషన్ ద్వారా ఎన్నికల సిబ్బందిని కేటాయించామన్నారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను, ఇతర పోలింగ్ సిబ్బందిని ఎంపిక చేశామన్నారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు కేటాయించిన ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 4546 మంది సిబ్బందిలో 3,088 మంది పురుషులు,1,458 మంది మహిళా సిబ్బంది అసెంబ్లీ ఎన్నికల విధుల్లో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఎన్నికల విధుల్లో పాల్గొనేవారి జిల్లాస్థాయిలో నిర్వహించిన శిక్షణ శిబిరాలకు హాజరైన ఎన్నికల సిబ్బంది ఇదివరకే ఫారం-12 ను అందుకున్న సిబ్బంది తప్పనిసరిగా సంబంధిత మండల విద్యాధికారులకు వెంటనే అందజేయాలని సూచించారు.

ఎన్నికల్లో పోస్టల్‌బ్యాలెట్ విధానం మారిన నిబంధన ప్రకారం నియోజకవర్గస్థాయి శిక్షణలో పాల్గొనే సిబ్బందికి అందజేసే పోస్టల్ బ్యాలెట్ పేపర్ ఓటును వినియోగించి అక్కడే ఏర్పాటుచేసిన బ్యాలెట్ బాక్స్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, ఈ డిస్టిక్ మేనేజర్ నరేశ్, హర్షద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో ఎంపికైన గురుకుల విద్యార్థి




జాతీయస్థాయి పరుగుపందెంలో ఎంపికైన క్రీడాకారులు

లింగాల, అక్టోబర్ 27 : స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో మొదటి సంవత్సరం విద్యనభ్యశిస్తున్న భానుప్రసాద్ విద్యార్థి అండర్-16 విభాగంలో అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బాలస్వామి, పీడీ వేంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ 300 పరుగుపందెంలో మొదటిస్థానం కైవసం చేసుకున్నట్లు తెలిపారు. నవంబర్ 7 నుంచి 10వరకు తమిళనాడులోని కోయంబత్తూర్‌లో నిర్వహించే 38వ జూనియర్ జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు తెలిపారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చినందుకు ప్రిన్సిపాల్ బాలస్వామి, పీడీ వేంకటేశ్వర్లు, అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు.

## నర్సరీలో పనులు వేగవంతం చేయాలి



మర్రిపల్లిలో నర్సరీ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

చారకొండ, అక్టోబర్ 27 : గ్రామాల్లో హరితహారంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో జయసుధ అన్నారు. శుక్రవారం మండలంలోని మర్రిపల్లి, తుర్కలపల్లిలో నర్సరీ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే ఏడాదికి హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు నర్సరీలో పనులపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. అదేవిధంగా పారిశుధ్య పనులు ప్రతి రోజు నిర్వహించాలని, పరిసరాలు పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు రవిశంకర్, కుర్మయ్య ఉన్నారు.

## ఎలక్ట్రానిక్ యంత్రాలపై అవగాహన కలిగి ఉండాలి



ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 27: ఎలక్ట్రానిక్ యంత్రాలపై అవగాహన ఉండాలని నోడల్ అధికారి నర్సింగ్‌రావు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ల లోని మీటింగ్ హాల్‌లో మాస్టర్ ట్రైనర్లతో అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శిక్షణ నోడల్ అధికారి మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఈవీఎం, వీవీ ప్యాట్లు, హ్యాండ్‌బుక్, పోలింగ్ కేంద్రాలపై పూర్తి అవగాహన ఉండాలని చెప్పారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను పోలింగ్‌కేంద్రాల్లో అమర్చడం, మాక్ పోలింగ్ నిర్వహణపై అన్ని విషయాలు తెలుసుకోవాలన్నారు. ఈవీఎంలలో సమస్య తలెత్తితే సెక్టర్ అధికారులకు వెంటనే తెలియజేస్తే రిజర్వు ఉన్న ఈవీఎంలను సంబంధిత పోలింగ్ కేంద్రానికి చేరవేస్తారని తెలిపారు. శిక్షణా తరగతుల్లో డీఈవో గోవిందరాజులు, ట్రైనర్స్ రాఘవేందర్ చంద్రశేఖరరావు రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.

**వాహనాలు తనిఖీ**

పాన్‌గల్, అక్టోబర్ 27 : మండలకేంద్రంలో శుక్రవారం ఎస్సై వేణు ఆధ్వర్యంలో పోలీసుసిబ్బంది వాహనాలు తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనాలతో పాటు ఆటో, కారు, ఆర్టీసీ బస్సులు తదితర వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నిబంధనలు ప్రతిఒక్కరూ తప్పకుండా పాటించాలని కోరారు. రూ.50వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకుంటే దానికి సంబంధించిన ఆధారాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.